
# సత్యవాక్కు



# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

**MARCH - 2003**

# సంక్షిప్త వార్తలు

2003 ఫిబ్రవరి మొదటి తేదీ నుండి కృష్ణా జిల్లా కేసర పల్లిలో క్రీస్తు సంఘ ఆవరణములో ప్రతిరాత్రి ప్రార్ధనలు, వాక్యపరిచర్య జరుచున్నవి. ఫిబ్రవరి 21నుండి 23వరకు అక్కడ సువార్త కూటములు జరిగెను. పి.డి.జి. కుమార్, పి.షడ్రక్, కె.రాజ్‌కుమార్ గార్లు వాక్యపరిచర్య చేసిరి. ఆరుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

ఫిబ్రవరి 10వ తేదీ సోమవారం ఉదయం 11గంటలకు తూర్పగోదావరి జిల్లా బిళ్లకుర్రులో అనిపేవారి పేటలో నిర్మించ బడిన నూతన ఆలయము ప్రతిష్టచేయబడెను. సోదరులు హర్షల్ గారు వాక్యపరిచర్య చేసిరి. జాషువా గూటం గారు ఆంగ్ల ప్రసంగమును తెలుగున కనువదించిరి. ప్రతిష్ట కార్యక్రమమునకు అనేకులు హాజరైరి. బిళ్లకుర్రు, పలివెల, పరిసరగ్రామాల్లో సోదరులు పి.జె.కృపాలిని గారు సువార్త చాటుచున్నారు.

ఫిబ్రవరి 10వ తేదీ సాయంకాలం 4 గంటలకు పెద్దాపురంలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును హర్షల్‌గారు రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవము గావించిరి. అనేకమంది హాజరై ఆ శుభ సమయంలో ప్రభువును స్తుతించిరి. హర్షల్‌గారి ఆంగ్ల ప్రసంగమును సోదరులు యస్.జాన్‌గారు (బిక్కవోలు బైబిలుస్కూలు డైరక్టర్) తెలుగున కనువదించిరి. జాషువాగారు తగు హెచ్చరికల నిచ్చిరి. వరిసర ప్రాంతముల సువార్తికులు వలువురు హాజరై గొప్పసహవాసములో పాల్గొందిరి. పెద్దాపురంలో సోదరులు పి. యేసురత్నంగారు, వారి కుమారుడు సంజీవ రావ్‌గార్లు వాక్యపరిచర్య చేయుచున్నారు.

ఫిబ్రవరి 19వ తేదీ బుధవారం కాకినాడలో సత్యవాణి కార్యాలయంలో సువార్తికుల సదస్సు జరిగెను. అనేక పట్టణముల నుండి, పల్లెల నుండి వందలాది సువార్తికులు, పురుషులు స్త్రీలు ఆనాడు హాజరై గొప్ప ఆత్మీయానుభూతిని పొందిరి. సదస్సులో చక్కటి క్రైస్తవపాటలు, మంచి బైబిలు అంశములు విన్పించబడెను.

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

Pleading for Restoration of First Century Christianity

సంపుటిక 23 మార్చి 2003 సంచిక 8


## నాలుగు రకములైన ఆరాధన

(Four Kinds of Worship)

దేవుని మనము ఆరాధించునప్పుడు ఆయన వాక్యము చొప్పుననే ఆరాధించవలెనని తెలిసికొంటిమి. ఆరాధన చేయునప్పుడు మన ఆరాధనమూర్తి నిజదేవుడై యుండవలెనని, మన మనస్తత్వము సరియైనదై యుండవలెనని కూడా ఇదివరకు మనము తెలిసికొని యున్నాము. అట్లు కానియెడల మనము దేవునికి చేయు ఆరాధన అంతయును ప్రయోజన శూన్యమగును. దేవుని ఆరాధనచేయుటలో నిమగ్నులైన మానవులు ఈనాడు ప్రపంచమందున్నారు. అయితే వారందరి ఆరాధన దేవునికి ఇష్టపూర్వకమైనది కాదు అని దైవ గ్రంథము వలన మనము గ్రహించుకొనవచ్చును. ఈనాడు మానవులు దేవునికి చేయు ఆరాధన కనీసము 4 రకములుగా నున్నది. క్రొత్త నిబంధన గ్రంథమును బట్టి మనము ఒక్కొక్క దానిని పరిశీ లించుదము.

మొదటిది వ్యర్థారాధన : నేడు క్రైస్తవులమని చెప్పకొనుచు దేవుని ఆరాధించువారిలో ఎక్కువమంది చేయు ఆరాధన వ్యర్థమైనది. మత్తయి వ్రాసిన సువార్త 15వ అధ్యాయము, 7వ వచనము నుండి 9వ వచనము వరకు మనము చదివిన యెడల, యేసు ఇట్లనుచున్నారు : "ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘనపరచుదురుగాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు".

ఒకనాడు యెరూషలేము నుండి శాస్త్రులను, పరిసయ్యులను యేసునొద్దకు వచ్చి, నీ శిష్యులు చేతులు కడుగుకొనకుండ భోజనము చేయుచున్నారే, వారెందు నిమిత్తము పెద్దల పారంపర్యాచారమును అతిక్రమించుచున్నారు? అని అడిగిరి. అందుకాయన - మీరును మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు?..... మీరు మీ పారంపర్యాచారము నిమితమై దేవుని వాక్యమును నిరర్ధకము చేయుచున్నారు....... మనష్యులు కల్పించిన పద్ధతులు దేవుని ఉపదేశములే యని బోధించుచు మీరు దేవుని వ్యర్థముగా ఆరాధించుచున్నారు అని యేసు వారిని హెచ్చరించెను.

నేటి క్రైస్తవలోకము నిజానికి ఆనాటి యూదులకు ఏమియును తీసిపోలేదు. యేసుక్రీస్తు కాలము నాటి యూదుల వలె నేడు క్రైస్తవ ఆరాధనలోనికి, ఆచరణలోనికి అనేకమైన పారంపర్యాచారములను తీసికొనివచ్చుట జరిగినది. భోజనము చేయుటకు ముందు చేతులు కడుగుకొనుట మంచిదే. అయితే చేతులు కడుగుకొనుటయే ఒక ఆరాధన క్రియగా చేయుట దోషము అగును. మనుష్యులు కల్పించిన సిద్ధాంతములు, బోధలు, ఆచారములు నేడు క్రైస్తవ లోకము నందెన్నియో ఉన్నవి. వాటన్నిటిని బట్టి మనము చేయు ఆరాధన నిజానికి ప్రయోజన శూన్యమైనది, పనికిరానిది, వ్యర్థమైనది యని మనము గ్రహించవలెను. పెద్దల పారంపర్యాచారమును బట్టి మనము దేవుని వాక్యమును నిరర్ధకము చేయుచున్నాము అని యేసు చెప్పచున్నారు (మత్త 15:7-9).

గనుక మిత్రులారా, మీ ఆరాధన క్రమమును, మీ ఆరాధన

క్రియలను ఒకసారి దేవుని వాక్యముతో సరిపోల్చి చూడుడి. వాక్య ప్రకారము లేకుండా, తరతరాల నుండి చేయుచున్న క్రియలు అందులో మీకు ఎన్నో కన్పడగలవు. అట్టివి లేనియెడల చాల సంతోషమేగాని, అట్టివి ఉన్న యెడల వాటిని తొలగించి, దేవుని వాక్యప్రకారము మీ ఆరాధన జరుగునట్లు చూడుడి. ఒకవేళ వాక్యము చెప్పుచున్న క్రియలను కొన్నిటిని మీరు జరిగించుటలేదేమో. వాటిని తప్పక మీరు చేయు లాగున జాగ్రత్తపడుడి.

రెండవదిగా, మనము తెలియని ఆరాధనను కనుకొనగలము. అపొస్తలుడైన పౌలు ఒకసారి ఏథెన్సు అను పట్టణమునకు వెళ్లెను. ఆ పట్టణము విగ్రహములతో నిండియుండుట చూచినందున అతని ఆత్మ పరితాపము పట్ట లేక పోయెను. అపొ.కా.17:22, 23 వచనములలో మన మీ విధముగ చదువగలము: "పౌలు అరేయొపగు మధ్యను నిలిచి చెప్పిన దేమనగా....... ఏథెన్సు వారలారా, మీరు సమస్త విషయములలో అతిదేవతాభక్తి కలవారై యున్నట్లు నాక కనబడుచు న్నది. నేను సంచరించుచు మీదేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద తెలియబడని దేవునికి అని వ్రాయబడి యున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తిని కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచురపరచుచున్నాను."

ఏథెన్సు పట్టణస్థులు భక్తిని కలిగియున్నారు. గాని వారు నిజదేవుని నెరుగనందున వారు "తెలియని ఆరాధనను" జరుపుచున్నారు. అట్టివారి మూఢభక్తిని దేవుడు గౌరవించడు. మూఢనమ్మకము చొప్పన చేసు ఆరాధన దేవునికి ఇష్టము కాదు. "ధర్మశాస్త్రము వినబడకుండ చెవిని తొలగించువాని ప్రార్థన హేయము" అని సామెతలు 28:9 లో వ్రాయబడి యున్నది. అందువలననే దేవుని యథార్థముగా ఆరాధించు వారు, "ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను" అని ఆయన కోరు చున్నారు. ఏథెన్సు వారివలె మనము చేయు తెలియని ఆరాధనను ఇకమీదట దేవుడు సహించడు. ఆయన ఇట్లు చెప్పుచున్నారు: "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి, చూడనట్లుగా నుండెను; ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ.కా. 17:30).

మూడవది, స్వేచ్ఛారాధన: ఇది కొలస్సయులకు వ్రాసిన పత్రిక 2:20-23 వరకు ఉన్న వచనములలో వివరింపబడినది. "మీరు క్రీస్తుతో కూడ లోకము యొక్క మూల పాఠముల విషయమై మృతి పొందినవారైతే, లోకములో బ్రతుకుచున్నట్టుగా మనుష్యులు ఆజ్ఞలను, పద్ధతులను అనుసరించి చేతపట్టుకొనవద్దు, రుచిచూడవద్దు, ముట్టవద్దు అను విధులకు మీరులోబడనేల? అవన్నియు వాడుకొనుట చేత నశించిపోవును. అట్టివి స్వేచ్ఛారాధన విషయములోను, వినయ విషయములోను, దేహశిక్ష విషయములోను, జ్ఞానరూపకమైనవని యెంచబడుచున్నవే గాని, శరీరేచ్ఛా నిగ్రహ విషయములలో ఏమాత్రము ఎన్నిక చేయతగినవి కావు".

స్వేచ్ఛారాధన యనునది మానవేచ్ఛలను బట్టి ఆరంభమైన క్రియలను సూచించుచున్నది. ఆ పదము భక్తిని సూచింపవచ్చునేమో గాని, ఆ భక్తి లేఖనములను అనుసరించి లేనప్పుడు అది ఖచ్చితముగా దేవునికి అంగీకారయోగ్యము కానిదగును.

ఆఖరిగ మనము క్రొత్త నిబంధనలో సత్యారాధనను గూర్చి చూడగలము. యోహాను 4:24లో యేసుక్రీస్తు యిట్లనుచున్నారు : "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను". ఆత్మతో ఆరాధింపవలె నన్నపుడు మనము ఆత్మజ్ఞానము గలవారమై నిష్కపటముగ ఆరాధింపవలెను. సత్యముతో ఆరాధించుటకు మనము సత్యవాక్య మేమి చెప్పుచున్నదో దానిని బట్టి చేయవలెను. ఒకవేళ మనము వాక్యప్రకారమే ఆరాధనను జరిగించుచున్నను, దానిని కోపబుద్ధితోను, దేవదూషణతోను, గర్వముతోను జరిగించిన, అట్టి ఆరాధన దేవునిచే తిరస్కరింపబడును. ఒకవేళ మనము ఆత్మజ్ఞానము కలిగి, లేఖనములు ప్రకారము ఆరాధనను జరిగించకుండిన యెడల అట్టి ఆరాధన కూడా తిరస్కరింపబడును. "సత్యము నందు వారిని ప్రతిష్ఠచేయుము, నీవాక్యమే సత్యము" అని యోహాను 17:17లో యేసు చెప్పెను. గనుక మనము దేవుని నారాధించునప్పుడు నిర్మలమైన బుద్ధిని, ఆత్మజ్ఞానమును కలిగినవారమై యుండవలెను; సరిగదా మన ఆరాధనను సత్యవాక్య ప్రకారము జరిగించవలెను. దానికి తక్కువగా గాని, ఎక్కువగా గాని

చేయకూడదు.

క్రొత్త నిబంధనను చదువునప్పుడు ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో కనీసము అయిదు సంగతులను జరిగించినట్లు మనము కనుగొనగలము. ఈనాడు మనము చేయు ఆరాధన, ఆదిమ క్రైస్తవులు చేసిన ఆరాధనతో సరిపోవుచున్నదో లేదో కూడ మనము పరిశీలించుట మంచిది.

1. ఆదిమ క్రైస్తవులు దేవుని వాక్యమును ధ్యానించుటకు కూడుకొనిరి. అపొ.కా.20:7లో పౌలు ఒక కూటములో ప్రసంగించుట మనము చూడగలము.

2. వారు ఆరాధనలో ప్రార్ధన చేయుటకు కూడుకొనిరి. ఆదిమ క్రైస్తవులు అపొస్తలుల బోధయందు, సహవాసమందు, రొట్టె విరుచుటయందు, ప్రార్ధన చేయుటయందు ఎడతెగక యుండిరి (అపొ.కా. 2:42).

3. వారు దేవునికి స్తుతిగానములు చేయుటకు కూడుకొనిరి. ఆరాధనలో వారు కీర్తనలు, ఆత్మ సంబంధమైన పాటలు మాత్రమే పాడిరి. గాని వాయిద్యములను వినియోగించలేదు. దయచేసి మీరు కొలస్స 3:16, ఎఫెసీ 5:19ని చదవండి.

4. ఆదిమ క్రైస్తవులు ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనమునందు పాలు పొందుటకు కూడుకొనిరి (అపొ.కా.20:7).

5. తరువాత, వారు వర్ధిల్లినకొలది దేవునికి కానుకలు నిచ్చుటకు కూడుకొనిరి (1 కొరింథి 16:1-2). లేఖనములు బయలుపరచు [illegible]త్య ఆరాధన యిది. మీరుచేయు ఆరాధన ఇట్లు లేనియెడల ఎక్కడో కొంత దోషము ఉన్నదని మీరు ఇట్టే గమనించగలరు. వాక్యమును బట్టి దానిని సరిదిద్దుకొందురని నా నిరీక్షణ.

దేవుని మనము ఆయన సంఘము ద్వారా ఆరాధించవలెను. "నమ్మి బాప్తిస్మము పొందిన" ప్రతివానిని ప్రభువు తన సంఘమందు చేర్చును. మీరు ఈనాడే ఆయన సువార్తకు లోబడి, ఆయనను ఆయన సంఘము ద్వారా మహిమ పరచుటకు సిద్ధపడవలెనని నా కోరికయై యున్నది !! (మార్కు 16:16; ఎఫెసీ 3:21).

☆☆☆

# దేవుని ఆలయము

(God's Temple)

కొరింధులో యున్న క్రీస్తు సంఘమునకు పౌలు ఇట్లు చెప్పాడు: "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా ? మీరు మీ సొత్తుకారు, విలువ పెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (1 కొరింథీ 6:19,20). కొరింధులోని ప్రజలు ఈ లోకభారములను విడిచి సువార్తకు విధేయులై నిజదేవుని, యేసుక్రీస్తును అంగీకరించిరి. వారు క్రైస్తవులు, క్రీస్తు సంఘస్థులు అయిరి. "మీరు మీ సొత్తుకారు" అని పౌలు వారికి చెప్పాడు. మన దేహము దేవునికే చెందును. ఆయన తన స్వరక్తముతో మనలను కొన్నారు. మన శరీరాత్మలు ఆయనవే. అందువలన మన దేహముతో దేవుని మహిమ పర్చాలి.

క్రైస్తవుడైన వాడు తన శరీరాన్ని దుర్వినియోగం చేసినా, అపవిత్ర పరచినా అతడు దేవుని ఆత్మ నివసించు ఆలయాన్ని అపవిత్ర పరుచును. "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?ఎవడైనను దేవుని ఆలయమును పాడు చేసిన యెడల దేవుడు వానిని పాడుచేయును"(1కొరింథీ 3:16,17). మనం దేవుని ఆలయమై యున్నాము గనుక, దేవునితో పాడుచేయబడ కుండు నిమిత్తము మన దేహములను అపవిత్ర పరచ కూడదు.

పాపమును గూర్చి మత శాఖలవారు వివిధ రీతులగు భోధింతురు. ఆత్మయే పాపం చేయును గాని దేహము కాదని కొందరంటారు. మరి కొందరేమో శరీరమే గాని ఆత్మ పాపము చేయదంటారు. అయితే ఈ సమస్యకు బైబిలే జవాబిచ్చుచున్నది : "పాపము చేయువాడే మరణము నొందును" (The Soul that sinneth, it shall die) అని యెహెజ్కేలు 18:4లో పరిశుద్ధాత్ముడు చెప్పాడు. గనుక "శరీర దురాశలకు లోబడు నట్లుగా చావునకు లోనైన మీ శరీరమందు పాపమును ఏల

నియ్యకుడి" యని అపొ.పౌలు చెప్పాడు (రోమా 6:12). మరల శరీర కార్యములు చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని అతడు చెప్పాడు. అవేవనగా, "జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు మత్తతలు, అల్లరితో కూడిన ఆట పాటలు మొదలైనవి". (గలతీ 5:20-21).

మానవుని ఆత్మ పాపము చేయును. ఆ పాపము శరీరములో చేయును. అందువలనే, "మీ ఆత్మయు, జీవమును శరీరమును మన ప్రభువైన యేసు రాకడయందు నిందా రహితముగాను సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడును గాక" యని పౌలు ప్రార్థించాడు (1 థెస్స 5:23).

కొందరు పొగత్రాగుచు, వారి దేహములను దేవునికి పవిత్రమైన ఆలయముగా యుంచు చున్నామని తలస్తారు. అయితే "పరిశుద్ధమును దేవునికి అనుకూలమైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనాలని" మనకు చెప్పబడి యున్నది (రోమా 12:1). క్రైస్తవులైన వారు పొగత్రాగుచు, మద్యపానము వగయిరా చేయుచు తమ శరీరములను పవిత్రముగా ఎట్లుంచు కొనగలరో నేనెరుగను. పొగత్రాగుట వలన శరీరానికి ఎంత హాని కలుగునో ఏవైద్యుని అడిగినా చెప్పను. రోగియైన వానికి వైద్యుడవుసరమని యేసు చెప్పారు. సిగరెట్లు తయారుచేసే కంపెనీల వాళ్లే పొగత్రాగుట హానికరమని చెబుతారు, అట్లు ప్రకటిస్తారు. అయినా కోట్లాది ప్రజలు తమ డబ్బిచ్చి హాని కొనితెచ్చు కొనుచున్నారు.

క్రైస్తవులు తమ శరీరములను పవిత్రముగా ఉంచుకోవాలి. ఆత్మ నివసించు గృహమది. మన శరీరాలను పాడుచేసుకొంటే, దేవుడు మనలనే బాధ్యులుగా ఎంచును. అందువలన మన హృదయాలను, దేహములను ఎల్ల వేళలా పవిత్రంగా ఉంచుకోవాలి.

--- జాన్ హేంన్

☆☆☆

# యేసు యొక్క ఉపమానములు

## (The Parables of Jesus)

యేసు ప్రభువు ఈ లోకంలో యున్నప్పడు ఆశ్చర్యమైన రీతిగా మానవులకు బోధించారు. ఆయన ఒక దృశ్యాన్ని వర్ణించుట ద్వారా మానవులను ఆలోచన పరులుగా చేసేవారు. ఆయన బోధలలో మూడోవంతు ఉపమానములే యున్నట్లు మనం చూడ గలము. జీవ మార్గము యొక్క సూత్రాలను సందిగ్ధావస్థలో వదిలి వేయక సామాన్య మానవులు సయితము గ్రహించుకొనే లాగున ఆయన బోధించారు. ఆడంబరమైన భక్తిని గూర్చి జాగ్రత్త పడుడి యనుట కంటే, నీవు ధర్మము చేయునప్పడు నీముందర బూర ఊదింపవద్దు అని ఆయన బోధించారు (మత్తయి 6:2). యేసు తరచు ఈలాగున అలంకార రీతిగా బోధించేవారు గనుక ఆయన అనేక ఉపమానములను తన బోధలో ప్రయోగించేవారు.

ఉపమానము అనే పదం గ్రీకు భాషలో ప్రక్కగా చెప్పబడింది అనే భావం కలిగియున్నది. తారతమ్యం కొరకు ఒక దాని ప్రక్క మరొకటి యుంచబడతాది, చెప్పబడతాది. ఉపమానమనగా పరలోక భావం కలిగియున్న భూలోక కధయని మనం చెప్పకొనవచ్చు. ఇదొక మంచి నిర్వచనం, అయినా దీనిలోకి అన్ని ఉపమానములు రావు. లూకా 4:23లో "వైద్యుడా నిన్ను నీవే స్వస్థ పరచుకొనుము" అను సామెత ఒక ఉపమానంగా చెప్పబడింది. యేసు "వెలుపలినుండి లోపలికి పోయి మనుష్యుని అపవిత్రునిగా చేయగలుగునది ఏదియు లేదుగాని, లోపలినుండి బయలు వెళ్లునవే మనుష్యుని అపవిత్రునిగా చేయునని" బోధించారు. ఆయన శిష్యులు ఈ ఉపమానమును గూర్చి ఆయన నడిగారని వ్రాయబడి యున్నది (మార్కు 7:15-17). ఇదొక పజిలు, ప్రశ్న వంటిది. నా లోపలికి వెళ్లే దానికంటే నాలోనుండి వెడలివచ్చే ప్రాముఖ్యమైనది యేమిటి ? అనే ప్రశ్న ప్రతివానిలోను రేకెత్తించే

బోధయది. గనుక సువార్తలలో వినియోగింపబడినఉపమానములు అలంకారరీతిగ చెప్పబడినవి. అయినను యేసు చెప్పిన ఉపమానములన్నీ ఇంచు మించు తారతమ్యములే, వాటిలో కొన్ని ఆసక్తిరకమైన కథలుగా కూడా మనకు కనబడతాయి.

క్రొత్త నిబంధనలో యేసు చెప్పిన రీతిగా ఉపమానములను యితరులు వినియోగించి యుండలేదు. ఒక్కో సందర్భములో ఉపమాన రీతిగాయున్న కథ పాత నిబంధనలో మనకు కన్పడతాది. యెషయా 5:1-7 లో ద్రాక్ష తోటను గూర్చి చెప్పబడిన ఉపమానము దీనికొక ఉదాహరణగా మనం చెప్పకోవచ్చు. ఇంకోటి, పాత నిబంధనలో చెప్పబడిన ప్రఖ్యాతమైన ఉపమానము 2 సమూయేలు 12:1-7 లో మనకు కన్పడుచున్నది.

### నాతాను చెప్పిన ఉపమానము

దావీదురాజు బత్షెబను మోహించాడు. ఆమెను పొందుటకతడు బత్షెబ భర్తయైన ఊరియాను యుద్ధము మోపుగా జరుగుచున్న చోట ముందుపెట్టి అతడు కొట్టబడి హతమగునట్లు చేసాడు. అతడు చనిపోయిన తరువాత దావీదు ఆమెను తన నగరికి తెప్పించుకొన్నాడు. అయితే దావీదు చేసినది యెహోవా దృష్టికి దుష్కార్యముగా ఉండెను (2 సమూ 11 అధ్యా).

"కావున యెహోవా నాతానును దావీదు నొద్దకు పంపెను; అతడు వచ్చి దావీదుతో ఇట్లనెను- ఒకానొక పట్టణ మందు ఇద్దరు మనుష్యులుండిరి. ఒకడు ఐశ్వర్యవంతుడు, ఒకడు దరిద్రుడు. ఐశ్వర్య వంతుడు విస్తారమైన గొర్రెలును, గొడ్లును కలిగియుండెను. అయితే ఆ దరిద్రునికి తాను కొనుక్కొనిన యొక చిన్న ఆడు గొర్రెపిల్ల తప్ప ఏమియు లేక పోయెను. వాడు దానిని పెంచుకొను చుండగా అది వాని యొద్దను బిడ్డల యొద్దను ఉండి పెరిగి వాని చేతి ముద్దలు తినుచు వాని గిన్నెలోనిది త్రాగుచు వాని కౌగిటపండుకొనుచు వానికి కుమార్తెవలె ఉండెను. అట్లుండగా మార్గస్థుడొకడు ఐశ్వర్యవంతుని యొద్దకు వచ్చెను. అతడు తనయొద్దకు వచ్చిన మార్గస్థునికి ఆయత్తము చేయుటకు తన గొర్రెలలో గాని గొడ్లలో గాని దేనిని ముట్టనొల్లక ఆ దరిద్రుని గొర్రెపిల్లను పట్టుకొని

వానికి ఆయత్తము చేసెను. దావీదు ఈ మాట విని ఆ మనుష్యుని మీద బహుగా కోపించుకొని, యెహోవా జీవము తోడు నిశ్చయముగా ఈ కార్యము చేసిన వాడు మరణ పాత్రుడు. వాడు కనికరము లేక యీకార్యము చేసెను గనుక ఆ గొర్రెపిల్లకు ప్రతిగా నాలుగు గొర్రెపిల్లల నియ్యవలెనని నాతానుతో అనెను. నాతాను దావీదును చూచి ఆ మనుష్యుడవు నీవే" అని చెప్పెను.

### ఉపమాన విధానము

యేసు ప్రభువు ఈ విధంగానే ఉపమానములను వినియోగించారు. మన దైనందిన జీవితాల్లో జరిగే వాస్తవ సంఘటనలను ఒక కధగా చెప్పి భూసంబంధమైన సంగతులతో పరసంబంధమైన సంగతుల తారతమ్యాన్ని అయన చూపించేవారు. భౌతిక సంగతులను మానవులెంత బాగుగా ఎరిగి యుందురో ఆయనకు తెలుసు. వ్యవసాయకుడు విత్తనములు విత్తుట, కోత కాలమున పనివారు గోధుమలను గురుగులను వేరు చేయుట, ఒక అసాధారణమైన ముత్యం కొరకు వర్తకుడొకడు తన యావత్తును వెచ్చించుట, సంత వీధులలో పిల్లలు ఆడుకొనుట మొదలగు సందర్భాలను వినియోగించి, ఆత్మీయ లోకంలోని అమూల్యమైన సూత్రాలను ఆయన ప్రజలకు బోధించారు. కొన్ని సార్లు మీరేమనుకొను చున్నారు ? అనే ప్రశ్నతో తన ఉపమానాన్ని ఆయన ఆరంభిస్తూ ప్రజలు తమ మేధస్సును వినియోగించేటట్లు చేసేవారు. లేదా ఉపమానానంతరం ప్రజల నుండి వారి యభి ప్రాయాన్ని తెలిసికొనగోరేవారు. ఒక కధను చెప్పట కారంభించుట ద్వారా ప్రజల యొక్క ఆసక్తిని రేకెత్తించేవారు. ఆయన వారిని ఎక్కడకు నడిపిస్తున్నారో తెలియకుండగనే వారాయనను జాగ్రత్తగా వినేవారు. గాని అకస్మాత్తుగా ఆయన చెప్పచున్న పాఠము యొక్క సారాంశము వారికి తెలియ వచ్చేది. ఆయన బోధించిన సూత్రాన్ని వారు వ్యతిరేకించేవారు కాదు. నాతాను దావీదుకు ఉపమానం చెప్పిన తరువాత జరిగింది యిదే. దావీదు చేసిన పాపమువలన అతని అంతరాత్మ కొంతమట్టుకు వాతవేయ బడింది. తెలియ కుండగనే

దావీదు తనపై తానే తీర్పు తీర్చుకొన్నాడు, శిక్ష విధించు కొన్నాడు. తన యొద్దకు వచ్చిన ఒక ఉపమానాన్ని చదివేటప్పుడు దానిలోని చిన్న చిన్న అంశముల యొక్క భావాన్ని వెదికేకంటే, అది బోధించు ముఖ్యపాఠం యేమిటో తెలుసుకోనాలి. దాని ముఖ్యాంశము తెలిసికొన్న తరువాత, దానితో సమన్వయించే సత్యాలను గ్రహించుకోవడం సులువు కాగలదు. విత్తువాని ఉపమానం విత్తబడిన వాక్యాన్ని ప్రజలు ఏలాగు అందుకొంటారో తెలియ జేయుచున్నట్లయితే, ఆ ఉపమానంలోని మిగతా అంశాలన్నీ ఈ ముఖ్యాంశాన్ని దృక్పథంలో పెట్టుకొనే అవగాహన చేసుకోవాలి.

మరల ఉపమానం యొక్క భావార్థాన్ని చెప్పేటప్పుడు, అది చెప్పబడిన పరిస్థితులను, సందర్భాలను మనసులో ఉంచుకోవాలి. ఆ ఉపమానం యొక్క వెనుక చరిత్ర, అది లేఖనాల్లో కనబడే సందర్భము, అన్నీ తెలిసికొంటే దాని భావార్థం చెప్పడానికి సహాపడ్తాయి. ఒక్కోసారి ఒకే ఉపమానంలో ఒకటికంటే ఎక్కువ పాఠములు ఉండవచ్చు. విత్తువాని ఉపమానంలో యేసు తన రాజ్యము యొక్క అనేక సంగతులను గూర్చి ప్రజలు తెలిసికోవాలని కోరుచున్నారు. మనం ఎలా వినుచున్నామో జాగ్రత్తా పడాలి, వాక్యం యొక్క శక్తిని మనం గమనించాలి. వాక్యం వినుచుండగా మన హృదయపు పరిస్థితి ఎట్లున్నదో గమనించుకోవాలి.

వచ్చే సంచికలలో యేసు ప్రభువు చెప్పిన ఉపమానాలాను గమనిద్దాం. ఆ ఉపమానములు ద్వారా ఆయన ఈనాడు కూడా మనకు నేర్పుచున్న ఆత్మీయ సూత్రాలను గ్రహించుదాం. యేసే ప్రభువని మనం విశ్వసిద్దాం. ఆయన చెప్పినట్లు మన పాపముల విషయమై మారు మనస్సు పొందుదాం. పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొంది, ఆయన సంఘముతో చేర్చబడి, ఆయన యొద్ద మరింత నేర్చుకొందాం.

--- జాషువా గూటం

☆☆☆

# సబ్బాతు సంగతి ఏమిటి ?

(గత సంచిక తరువాయి)

**అది ఒక గురుతు :**

మోషే సీనాయి కొండపై యున్నప్పుడు సబ్బాతు ఒక గురుతుగా యుండునని దేవుడతనికి బయలు పరచెను. "నాకును ఇశ్రాయేలీయులకును అది ఎల్లప్పుడును గురుతై యుండును; ఏలయనగా ఆరు దినములు యెహోవా భూమ్యాకాశములను సృజించి ఏడవ దినమున పని మాని విశ్రయించెను" (నిర్గమ 31:17). అది దేవునికి ఇశ్రాయేలీయులకును మధ్య ఒక గురుతు. అది మానవు లందరికిని దేవునికిని మధ్యనున్న గురుతుకాదు. అది వారు తమ విమోచనను జ్ఞాపక ముంచుకొనుట కీయబడెను. అది వారి మధ్యనున్న ఒక గురుతు. దేవుడు నోవహుతో ఒక నిబంధన చేసెను. ఆ నిబంధనకు గురుతుగా మేఘములో ఒక ధనస్సు నిచ్చెను. అది "నాకును సమస్త శరీరులకును మధ్య నేను స్థిరపరచిన నిబంధనకు గురుతు" అని ఆయన చెప్పెను (ఆది 9:17). అయితే సబ్బాతును ఇచ్చినప్పుడు "అదినాకును ఇశ్రాయేలీయులకును ఎల్లప్పుడును గురుతై యుండునని" ఆయన చెప్పెను.

### నిత్యము, ఎల్లప్పుడు, తర తరములు

సబ్బాతును ఇప్పుడు కూడ ఆచరించవలెనని బోధించువారు, నిర్గమ 31:3-17ను చూపించి వారి ఆచారము సరియైనదే యని సమాధానము చెప్పదురు. "ఇశ్రాయేలీయులు తమ తరతరములకు విశ్రాంతి దినాచారమును అనుసరించి ఆ దినము నాచరింపవలెను; అది నిత్య నిబంధన. నాకును ఇశ్రాయేలీయులకును అది ఎల్లప్పుడును గురుతై యుండును" (నిర్గమ 31:16, 17).

సమాప్తమైపోయిన మిగిలిన విషయములను గూర్చి చెబుతు మోషే ఇదే మాటలను వినియోగించెను : "మరియు సాయంకాలమందు అహరోను ప్రదీపములను వెలిగించినప్పుడు దానిమీద ధూపము వేయవలెను. అది మీ తరములకు యెహోవా సన్నిధిని

నిత్యమైన ధూపము" (నిర్గమ 30:8). ధూపార్పణలు సిలువ యొద్ద అంతమాయెనని ఎడ్వంటిస్టువారు కూడ అంగీకరింతురు. అయితే మీ తరములకు నిత్యమైన ధూపము అని మోషే చెప్పెను. అది యూదుల యుగములోనే నిత్యము ఉండునని అతని ఉద్దేశ్యము. అది సిలువ యొద్ద అంతమాయెను.

యాజకత్వపు విధి నిత్యమైనది (నిర్గమ 29:9). అది తరతరములకు, నిత్యము ఉండు యాజకత్వము (నిర్గమ 40:15). ధూపములు వేయుచు, దహనబలుల నర్పించుచు, మందిరములో (గుడారములో) పనిచేయు యాజకులను మనము కలిగి యుండవలెనా ? కాదు. వారు యూదుల యుగమందంతటను తరతరములు, నిత్యము ఉండువారు.

పస్కా ఒక జ్ఞాపకార్థ చిహ్నము. "కాబట్టి ఈ దినము మీకు జ్ఞాపకార్థమైన దగును. మీరు యెహోవాకు పండుగగా దాని నాచరించ వలెను; తరతరములకు నిత్యమైన కట్టడగా దాని నాచరించ వలెను" (నిర్గమ 12:14). మనము ఇప్పుడు కూడ మొదటి నెలలో పదునాల్గవ దినమున పస్కా పశువును వధింపవలెనా? అది తరతరములకు, నిత్యము ఉండవలసినదిగదా? నిత్యము అనినప్పుడు అది ఎంతకాలము మట్టుకో చెప్పబడెను. అది వారి తరతరములకు ఉండవలెను. లేదా యూదా యుగకాలమంతయు ఉండవలెనని యర్థము.

సబ్బాతు మీ తరములలో, ఎల్లప్పుడు, నిత్యము ఉండునట్టిది. ధూపార్పణలు, యాజకత్వపుపని, పస్కా యున్నంతకాలము అది ఉండును. అవి అంతమైన యెడల సబ్బాతుకూడ అంతమాయెను నిజానికి వీటివలె సబ్బాతుకూడ యూదుల యుగములో ఆచరణలో యుండెను. అది సిలువ యొద్ద అంతమాయెను. ధర్మశాస్త్రపు విధులు, సబ్బాతు కలసి నిలబడును లేదా పడిపోవును. "ఇదియుగాక యాజకులు మార్చబడిన యెడల అవశ్యముగా యాజక ధర్మము సహా మార్చబడును" (హెబ్రీ 7:12).

## "విశ్రాంతి దినము ఎప్పుడై పోవును ?"

యెహోవా ధర్మశాస్త్రము, మోషే ధర్మశాస్త్రము అనునవి ఒకే ధర్మశాస్త్రమున కీయబడిన రెండు పేరులని మనము గమనించితిమి. అంటే యూదుల కీయబడినది ఒకే ఒక్క ధర్మశాస్త్రము గనుక, ధర్మశాస్త్రము ఎత్తివేయబడెను లేక కొట్టివేయబడెను అని క్రొత్త నిబంధన లేఖకులు చెప్పినప్పుడు, ఆ ఒకే ధర్మశాస్త్రము అంతమాయెనని మనము గ్రహించుకొన గలము. సబ్బాతు నిజముగా ఎప్పుడు అంతమాయెనో ఇప్పుడు తెలిసికొందము : "తూము చిన్నదిగాను రూపాయి యెక్కువదిగాను చేసి, దొంగత్రాసుచేసి మనము ధాన్యమును అమ్మునట్లు అమావాస్య ఎప్పుడై పోవునో, మనము గోధుమలను అమ్మకము చేయునట్లు విశ్రాంతిదినము ఎప్పుడు గతించిపోవునో యని చెప్పకొను వారలారా, దరిద్రులను వెండికి కొనునట్లును పాదరక్షలనిచ్చి బీదవారిని కొనునట్లును, చచ్చు ధాన్యమును మనము అమ్ముదము రండని, విశ్రాంతిదిన మెప్పడై పోవునో అని చెప్పవారలారా, ఈ మాట ఆలకించుడి" (ఆమోను 8:5, 6).

ఆమోసు కాలమునాటికి యూదులు సబ్బాతును, దానితో గల నిర్బంధములను వదలుకోగల్గిన యెడల వారు వ్యాపారము చేసి లాభము సంపాదించెద మనుకొనిరి. "విశ్రాంతిదిన మెప్పడై పోవునో?" యనునది వారి ప్రశ్న.

ఆమోసు వారి ప్రశ్నకు జవాబిచ్చెను : "ప్రభువైన యెహోవా సెలవిచ్చున దేమనగా ఆదినమున (అనగా సబ్బాతు గతించిపోవు దినమున) నేను మధ్యాహ్న కాలమందు సూర్యుని అస్తమింపజేయుదును. పగటి వేళను భూమికి చీకటి కమ్మజేయుదును" (ఆమోను 8:9). మధ్యాహ్న కాలమందు సూర్యుడు అస్తమించునప్పడు, పగటివేళను భూమికి చీకటి కమ్మునప్పడు విశ్రాంతి దినము అంతమైపోవునని ఈ దివ్య ప్రేరిత లేఖకుడు వక్కాణించుచున్నాడు.

అది ఎప్పడు జరిగెనో నిర్ణయించుటకు నీకేమైనా కష్టముగా యున్నదా ? "అప్పడు రమారమి మధ్యాహ్న మాయెను. అది

మొదలుకొని మూడు గంటల వరకు ఆదేశ మంతటిమీద చీకటి కమ్మెను. సూర్యుడు అదృశ్యు డాయెను; గర్భాలయపు తెర నడిమికి చినిగెను" (లూకా 23:44, 45). యేసు మధ్యాహ్న కాలమందు చనిపోయెను. సూర్యుడు తన కాంతి నిచ్చుటకు తిరస్కరించెను.

మధ్యాహ్న కాలమందు సూర్యుడు అస్తమించి నప్పడు విశ్రాంతి దినము అంతమాయెను. యేసు సిలువపై మరణించినప్పడు మధ్యాహ్న కాలమందు సూర్యుడు అస్తమించెను. గనుక యేసు సిలువపై మరణించినప్పడు సబ్బాతు అంతమాయెను. "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను ఉండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను" (కొలస్స 2:14).

**ఆదివారమున ఆరాధించుట బైబిలు నందున్నదా ?**

సిలువకు మేకులతో కొట్టివేయ బడుటవలన విశ్రాంతి దినము ఎత్తివేయబడెనని చెప్పిన తరువాత ఆదివారమునాడు ఆరాధించుటకు మనము బైబిలు అధికారమును కనుగొనవలెను. అది దేవుని బోధా? లేక మానవునిదా ? అది మానవుని నుండి కలిగిన యెడల దానికి బైబిలు అధికారము లేదు గనుక దానిని మనము విడిచి పెట్టవలెను. మనము చేయు ప్రతి ఆత్మీయ సంగతికి బైబిలు అధికారము అవుసరము. "ఇల్లు కట్టువారు నిషేదించిన రాయి మూలకు తన రాయి ఆయెను. అది యెహోవావలన కలిగినది. అది మన కన్నులకు ఆశ్చర్యము, ఇది యెహోవా ఏర్పాటు చేసిన దినము. దీనియందు మనము ఉత్సహించి సంతోషించెదము" (కీర్తన 118:22-24).

"ఇల్లుకట్టువారు నిషేధించిన రాయి" యేసును సూచించుచు చెప్పినమాట యనుటలో సందేహ మేమియులేదు. అపొ.కా. 4:11లో ఇదే వచనము అపొ. పేతురు యేసుకు వర్తింపజేసెను. నిషేధించబడిన ఆరాయి యేసుగాని, అది మూలకు తలరాయి ఆయెను. ఆయన మూలకు తలరాయి ఎప్పడయ్యెను? ఆయన మృతులలోనుండి

లేచినప్పుడే ఖచ్చితముగా తలరాయి అయ్యెను. యేసు బోధించినదంతయు, తననుగూర్చి చెప్పకొన్నదంతయు ఆయన సమాధి నుండి మూడవ దినమున తిరిగి లేచుటపై మోపెను. "ఆదివారమున తెల్లవారినప్పడు యేసులేచి తాను ఏడు దయ్యములను వెళ్లగొట్టిన మగ్దలేనే మరియకు మొదట కనబడెను" (మార్కు 16:9). యేసు ఆదివారమున సమాధి నుండి తిరిగి లేచెను గనుక ఆదినమున ఆయన మూలకు తలరాయి అగుట నీవు చూచుచున్నావా?

ఇది యెహోవావలన కలిగెను అని కీర్తనల గ్రంథకర్త చెప్పెను. ఇది యెహోవా ఏర్పాటు చేసిన దినము. ఇది ప్రభువు దినము. ఏది ప్రభువు దినము ? యేసు మూలకు తలరాయి చేయబడిన దినమే ప్రభువు దినము, యేసు తన పునరుత్థాన దినమందు మూలకు తలరాయి చేయబడెను గనుక ఆదివారమే ప్రభువు దినము.

"నేను ప్రభువు దినమందు ఆత్మవశుడనై యుంటిని" యని చెప్పటలో అపొ. యోహాను యొక్క భావము కూడ అదియే (ప్రకటన 1:10). ఒక విధముగా దినము లన్నియు ప్రభువుకే చెందునుగాని, ఈ దినమందు ఆయన తిరిగి లేచెను గనుక ఇది ఆయనది. అన్నిరకములైన భోజన పదార్థములను ఆయన మన కిచ్చుచున్నాడు గనుక అవి ఆయనకు చెందును. అయితే ఇంకొక విధముగా ప్రభురాత్రి భోజనము ఆయనది. అట్లే దినము లన్నియు ఆయనకే చెందినను ఇంకొక విధముగా ఆదివారము ఆయనది.

## 2 కొరింథీ 3:7-11

ఈ లేఖన భాగమును లోతుగా చదివిన యెడల సబ్బాతు దినముతో కూడిన ధర్మశాస్త్రము ఎత్తివేయబడెనని గ్రహింపగును. పాత క్రొత్త నిబంధనల తారతమ్యము అక్కడ యున్నది. దానిని వచనముల వారీగా గమనించుము.

7వ వచనము : ఒక ధర్మశాస్త్రము మరణ కారణమగు పరిచర్య యని పిలువబడెను. దానిని సులువుగా గుర్తించుటకు దానిని గూర్చి

రెండు సంగతులు చెప్పబడెను. మొదటిగా,అది రాళ్ళమీద చెక్కబడి వ్రాయబడెను. రెండవదిగా, అది ఇయ్యబడినప్పడు మోషే, ముఖము ప్రకాశించెను (నిర్గమ 34: 29-35). పది ఆజ్ఞల ధర్మశాస్త్రము గాక ఈ వర్ణనకు సరిపడు ధర్మశాస్త్రము ఏదైనా ఒకటి యున్నదా? ఈ ధర్మశాస్త్రమును గూర్చి చెప్పబడినది ఏదయినను, అతడు సబ్బాతును గూర్చిన ఆజ్ఞయున్న రాతి పలకలను గూర్చి చెప్పచున్నాడని మన మెరుగుదుము. ఈ ధర్మశాస్త్రము మహిమ కలది యని చెప్పబడెను. అది ఎత్తివేయబడవలెను.

8వ వచనము : క్రొత్త నిబంధన ఆత్మ సంబంధమైన పరిచర్య యని చెప్పబడెను. రాళ్లపై చెక్కబడి వ్రాయబడినది మహిమగలదియైతే, యిది అత్యధిక మహిమ గలదియై యుండెను.

9వ వచనము : శిక్షావిధికి కారణమైన పరిచర్య మహిమ కలిగినదైతే నీతికి కారణమైన పరిచర్య యెంతో అధికమైన మహిమ కలది.

10వ వచనము : రాళ్ళమీద వ్రాయబడినది మహిమగలదియే గాని, క్రొత్త నిబంధనతో పోల్చి చూచినప్పడు దీని మహిమ అత్యధికమైనది గనుక ఇంతకు మునుపు మహిమకలదిగా చేయబడి నది మహిమ లేని దాయెను.

11వ వచనము : రాళ్ళమీద వ్రాయబడినది మహిమ కలదియని చెప్పబడెను. అది ఎత్తివేయబడెను (7వ). ఇప్పడు నిలుచునది మరి యెక్కువ మహిమ గలది.

రాళ్ళమీద చెక్కబడిన ధర్మశాస్త్రము ఎత్తివేయబడినందున, సబ్బాతు దినము ఆ ధర్మశాస్త్రములో ఒక భాగమై యున్నందున అదియును ఎత్తివేయబడెనను సత్యమును అంగీకరించవలెను.

## సంగ్రహము

లేఖనముల నుండి ఈదిగువ సంగతులను నిరూపించితిమని నా విశ్వాసము :

1. మోషే ధర్మశాస్త్రము, యెహోవా ధర్మశాస్త్రము అనునవి

ఒకటేగాని రెండుకాదు.

2. పది ఆజ్ఞలను దేవుడే ప్రజలకు వినిపించెను. తరువాత మిగిలిన ఆజ్ఞలతో కూడ ఒక గ్రంథమందు వ్రాయబడి, రాతిపలకలను గూర్చి చెప్పబడక ముందు ప్రజలకు మోషేచే చదివి వినిపించబడెను.

3. తాము ఐగుప్తు నుండి విమోచింపబడిన సంగతిని జ్ఞాపకముంచుకొను నిమిత్తము సబ్బాతు యూదులకు ఈయబడెను.

4. మధ్యాహ్న కాలమందు సూర్యుడస్తమించినప్పడు సబ్బాతు అంత మొందెను. యేసు సిలువపై మరణించినప్పడు మధ్యాహ్న కాలమందు సూర్యుడస్తమించెను. క్రీస్తు సిలువ యొద్ద సబ్బాతు అంత మొందెను.

5. తన పునరుత్థాన దినమందు యేసు మూలకు తలరాయి ఆయెను. ఆయన ఆదివారమునాడు పునరుత్థానుడాయెను. ఇది యెహోవా ఏర్పాటు చేసిన దినము.

సబ్బాతు ఆచరణగూర్చి తీవ్రముగా పరిశోధించ వలెనని కోరుచు ఈచర్చను ఎట్లు ఆరంభించితిమో అదేకోరికతో దీనిని ముగించు చున్నాము. దేవునికి విధేయులైన వారు మాత్రమే రక్షింపబడుదురని మనిద్దరము నమ్ముదుము. అందువలన దేవునికే లోబడగల్గునట్లు ఆయన ఏమి చెప్పెనో మనము తెలిసికొనుట చాల ప్రాముఖ్యము.

---- ఆల్బర్ట్ గార్డనర్

(సమాప్తము)

☆☆☆

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి"
కార్యక్రమమును తేజ ఛానల్‌లో ప్రతి శనివారం
ఉ॥ 6:30 నుండి 7-00 వరకు చూడండి.

# సౌత్ మద్రాస్ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ విద్యార్థుల ప్రవేశమునకై ఆహ్వానము.

విద్యార్థులకు బైబిలులో మంచి శిక్షణతో పాటు
దైవికమైన క్రమశిక్షణ నేర్పించబడును.

శిక్షణ కాలము :- రెండు సంవత్సరములు
(సెమిస్టర్ విధానములో ఉండును)

మీడియం :- తెలుగు భాష

అర్హతలు :- 1) తెలుగు చదువుట వ్రాయుట తెలిసియుండ వలెను.
2) బైబిలు నందు ఆసక్తి కలిగియుండవలెను.
3) 17 సం॥లకు పైబడిన పురుషులై యుండవలెను.

గమనిక :- 1) ఈ 2సం॥ల కోర్సును సంపూర్ణము చేసిన వారికి సర్టిఫికెట్ ఇవ్వబడును.
2) ఉచిత భోజనము వసతులతోపాటు స్టైఫండ్ ఇవ్వబడును.

పైన తెలుపబడిన వివరములు ప్రకారము 2సం॥ల బైబిలు తర్ఫీదునకై ఆసక్తిగలవారు అడ్మిషన్ ఫారములు పొందుటకై ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.

వివరములకు :- **డైరక్టర్**

**సౌత్ మద్రాస్ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్**
**16 క్రాస్ స్ట్రీట్, భారతి ఎవిన్యూ**
**కోటూర్, చెన్నై - 600 085**
**ఫోన్ : 044 - 24451153**

---

గమనిక : సత్యవాక్కు వలయు వారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

**Satya Vani, P.O.Box - 80, Kakinada - 533 001.**

## Declaration (See Rule 3)

| | | |
|---|---|---|
| Titlle of the News paper | : | Satya Vakku |
| Language | : | Telugu |
| Name & Addres of the publisher | : | Joshua Gootam<br>10-4-33/1, SeshagiriRao St.,<br>Kakinada - 533 004 |
| Nationality | : | Indian |
| Name of the printer with address | : | Joshua Gootam<br>10-4-33/1, SeshagiriRao St.,<br>Kakinada - 533 004 |
| Place of printing with address | : | Satya Vani<br>Church of Christ, 7-9-35,<br>Samba murthy St.,<br>Kakinada - 533 001 |
| Place of Publishing | : | Satya Vani<br>Church of Christ, 7-9-35,<br>Samba murthy St.,<br>Kakinada - 533 001 |
| Name of the Editor | : | Joshua Gootam (Indian)<br>10-4-33/1, SeshagiriRao St.,<br>Kakinada - 533 004 |

I, Joshua Gootam declare that particulars in respect of the News paper above are true to the best of my knowldge and belief.

Sd -
Joshua Gootam

ఆ సదస్సుకు అమెరికా నుండి సోదరులు లెన్నీరీగన్ గారు, తిమోతివిల్క్ గారు ప్రత్యేకముగా ఆహ్వానింపబడిరి. వారిరువురు గొప్ప బైబిలు అంశములను బోధించిరి. హాజరైనవారందరు ఆత్మీయముగా బలపడిరి. ఆ సదస్సు కార్యక్రమములో సోదరులు టి.వి.యన్.కుమార్, యస్.జాన్, వి.సుదర్శన్‌రావ్, పి.యస్.ఆర్.జైపాల్ గార్లు ప్రత్యేకముగా పాల్గొనిరి. హాజరైన వారందరికీ మంచి భోజనము, తేనీటి పానీయములు ఏర్పాటు చేయబడెను. సదస్సు ఆనంతరము 8 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

ఫిబ్రవరి 20వ తేదీ నుండి 25వ తేదీ వరకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో పలుగ్రామములలో సువార్త కూడికలు ఏర్పాటు చేయబడెను. ఉప్పలగుప్తం, బడుగువారిపేట, పేరాయిచెరువు, వాడపర్రు, పెళ్లికూతురమ్మచెరువు, కరుగోరుమిల్లి, కొండుకుదురు, కురెళ్లగూడెం, పులిమేరు, చదలాడ గ్రామములలో ఏర్పాటు చేయబడిన కూడికలలో పైనుదహరించిన ఇరువురు విదేశీ సోదరులు పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. భారతదేశములో అభివృద్ధి జెందుచున్న క్రీస్తు సంఘ పరిచర్యను వారు గ్రహించగల్గిరి. ఆయా గ్రామములలో ఎ.వెంకట్రావ్, పండ అర్జునరావ్, పెయ్యల సత్యనారాయణ, డి. రంగారావ్, యం. కృపానందం, డి. చిరంజీవి, యన్.ఏలియా, యన్.జగజీవనరాజు, గోసాల సూర్యప్రకాశరావ్, చిట్టిబాబు, ఎ.విజయరాజు, యన్.మోజెస్, రవికుమార్, డి.ఇశ్రాయేలురాజు, బుర్రేయోహాను, యమ్. ప్రేమ్‌కుమార్ గార్లు క్రీస్తు కొరకు శ్రమించుచు సువార్త చాటుచున్నారు. ఆయా గ్రామములలో జరిగిన సువార్త దండయాత్ర వలన 103 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

ఫిబ్రవరి 19, 20, 21తేదీలలో రామచంద్రపురం మండలం ఓదూరు గ్రామములో క్రీస్తు సంఘవార్షిక సువార్త కూటములు జరిగెను. ఆ కూటములలో సోదరులు పి.జయపాల్, పి.డి.బిషప్, జోసఫ్, యన్.ప్రసాద్ గార్లును, లెన్నీరీగన్ గారును వాక్యపరిచర్య చేసిరి. ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఓదూరులోను, అగ్రహారంలోను సోదరులు పి.సుందర్‌రావ్ గారు వాక్య పరిచర్య చేయుచున్నారు, గొప్ప సేవ చేయుచున్నారు.

ఫిబ్రవరి 28వ తేదీ శుక్రవారం బిక్కవోలు బైబిలుస్కూలు ఆవరణలో సువార్తికుల సహవాస కూటము ఏర్పాటు చేయ బడెను. ఆ కూటములో సోదరులు డేనీరేడర్‌గారు వాక్యపరిచర్య చేసిరి. సువార్తికుల సహవాసకూటమునకు బిక్కవోలు బైబిలుస్కూలు డైరక్టర్ యస్.జాన్ గారు తగు ఏర్పాట్లు చేసి జయప్రదముగా నడిపించిరి.

సత్యవాణి రేడియో కార్యక్రమాలతో పాటు సత్యవాణి టి.వి కార్యక్రమము ప్రతి శనివారం ఉదయం 6:30 నుండి 7:00 గంటల వరకు తేజ ఛానల్‌లో ప్రసారము చేయబడుచున్నది. వేలకొలది ప్రజలు క్రీస్తును గూర్చి, ఆయన సంఘమును గూర్చి సత్యమును గ్రహించుచున్నట్లు ఫోన్ల ద్వారాను, ఉత్తరాల ద్వారాను తెలియ పర్చుచున్నారు. సత్యవాణి పరిచర్యల కొరకై విడువక ప్రార్థించమనవి.

RNI Regd. No. 69973/98

Postal Regd. No. VM/KD/02/2002

From:

SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.